క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

కొత్తపట్నం: స్థానిక బస్టాండ్ సెంటర్ దగ్గరున్న శ్రీరామ వెంకటరంగం శెట్టి కల్యాణ మండపంలో ఆస్టర్ రమేష్, నల్లూరి సూపర్ స్పెషాలిటీ సర్వీసెస్, ఒంగోలు వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు దుర్గాప్రసాద్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం వరకు వైద్య పరీక్షలు జరుగుతాయన్నారు. బీపీ, సుగర్, ఈసీజీ, పీఎఫ్‌టీ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. రోగులు వారి పాత రిపోర్టులతో వచ్చి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రసవాలపై ఆడిట్ నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ అనిల్

ఒంగోలు వన్‌టౌన్: ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రసవాలపై ఆడిట్ నిర్వహించాలని రాష్ట్ర వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు డాక్టర్ అనిల్ కుమార్ ఆదేశించారు. శనివారం జిల్లాకు వచ్చిన ఆయన.. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి, ఇతర ప్రోగ్రాం అధికారులతో కలిసి ఒంగోలులోని డీఎంహెచ్‌ఓ చాంబర్‌లో మాతాశిశు సంరక్షణ సేవలపై సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. సాధారణ, కష్టతర కాన్పులు నిర్వహించడానికి అవసరమైన అన్ని మౌలిక వసతులను అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బాల్య వివాహాలను నివారించడంలో ఇతర లైన్ డిపార్టుమెంట్ల సహకారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, డాక్టర్ పి.పద్మజ, డాక్టర్ సౌజన్య, డాక్టర్ శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా కొవ్వొత్తుల ప్రదర్శన



కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

ఒంగోలు సిటీ: భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్ 94వ వర్ధంతి మార్చి 23 తేదీని పురస్కరించుకుని నగరంలోని మంగమూరు రోడ్డు బైపాస్ సిగ్నల్ జంక్షన్ వద్ద శనివారం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగర కార్యదర్శి దానియేలు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.ఎఫ్.బాబు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం పోరాటంలో కేవలం 23 ఏళ్లకే ఉరి కంభాన్ని ముద్దాడి ప్రాణాలు వదిలిన భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని పురస్కరించుకుని మాదకద్రవ్యాలను, అత్యాచారాలను అరికడదాం - యువత భవిష్యత్తుని కాపాడుకుందాం అనే నినాదంతో నగరంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత సమాజంలో యువకులు మాదకద్రవ్యాలు, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండి మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందితేనే భవిష్యత్తు బాగుంటుందన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నగర కమిటీ సభ్యులు రాంబాబు, నవీన్, దాసు, సురేష్, సీఐటీయూ నాయకుడు హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

సీఐఎస్ఎఫ్ పాత్ర అభినందనీయం


సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న సీఐఎస్ఎఫ్ జవాన్లకు స్వాగతం పలుకుతున్న ఎస్పీ దామోదర్, పోలీసు సిబ్బంది



- దేశ అంతర్గత శాంతిభద్రతల పరిరక్షణలో కీలకం
- ఎస్పీ దామోదర్

ఒంగోలు సిటీ: దేశ అంతర్గత శాంతి భద్రతల పరిరక్షణలో సీఐఎస్ఎఫ్ పాత్ర అభినందనీయమని ఎస్పీ దామోదర్ అన్నారు. సముద్ర మార్గం ద్వారా ఉగ్రవాదులు రాకుండా, మాదక ద్రవ్యాల రవాణా జరగకుండా చూడటంలో తీర ప్రాంత ప్రజలు కీలకంగా ఉండాలని ఆకాంక్షిస్తూ సీఐఎస్ఎఫ్ జవాన్లు చేపట్టిన సైకిల్ ర్యాలీ శనివారం ఒంగోలులోని జిల్లా పోలీస్ కార్యాలయానికి చేరుకుంది. సముద్ర తీర ప్రాంతం ద్వారా వచ్చే సంఘవిద్రోహ శక్తులు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా సీఐఎస్ఎఫ్ జవాన్లు చేపట్టిన ఈ సైకిల్ ర్యాలీని సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ సంజీత్ కుమార్‌తో కలిసి జెండా ఊపి ఎస్పీ ప్రారంభించారు. జవాన్లకు పోలీసులు, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ సీఐఎస్ఎఫ్ దేశం నలుమూలల నుంచి అంతర్గత పరిరక్షణలో ప్రముఖ పాత్ర పోషిస్తోందన్నారు. దేశంలో అత్యున్నత ప్రమాణాలతో భద్రత అందిస్తున్న పారా మిలటరీ దళం సీఐఎస్ఎఫ్ అని తెలిపారు. సముద్ర తీర ప్రాంత ప్రజలలో దేశభద్రత, సమైక్యతను పెంపొందించి దేశ, రాష్ట్ర, జిల్లా ప్రజలను సీఐఎస్ఎఫ్ సిబ్బందితో మమేకం చేస్తూ ర్యాలీ చేపట్టడం గొప్ప విషయమన్నారు. దారి పొడవునా తీరంలో ఉన్న ప్రజలకు వీరు భద్రతపై అవగాహన కల్పిస్తూ మార్చి 7న కోల్‌కతా సమీపంలోని బక్కలి (వెస్ట్ బెంగాల్) నుంచి ర్యాలీ ప్రారంభించి మార్చి 31న కన్యాకుమారి చేరుకుంటారన్నారు. సముద్రతీరాన్ని రక్షించడం సీఐఎస్ఎఫ్ ఒక్కరి బాధ్యతే కాదని, ప్రజలందరి బాధ్యత కూడా ఉందని అన్నారు. ప్రజలను భాగస్వామ్యులుగా చేయాలనే ఉద్దేశంతో సీఐఎస్ఎఫ్ బృహత్తర కార్యక్రమం చేపట్టిందని ఎస్పీ అభినందించారు. సీనియర్ కమాండెంట్ సంజీత్ కుమార్ మాట్లాడుతూ 50 మందితో సైకిల్ ర్యాలీ చేపట్టామన్నారు. 6,553 కిలోమీటర్లు ప్రయాణించి ఈ నెల 31వ తేదీ కన్యాకుమారి చేరుకుంటామన్నారు. గుజరాత్లోని వెస్ట్ కోస్టు లక్పత్ పోర్టు నుంచి 50 మంది, కోల్‌కతా నుంచి 50 మంది సైకిలిస్టులు ఇరువైపుల నుంచి కన్యాకుమారి చేరుకుంటారన్నారు. ఇప్పటి వరకు 16 రోజులు సైకిల్ ర్యాలీ ద్వారా ప్రయాణించినట్లు తెలిపారు. ర్యాలీలో 14 మంది మహిళా జవాన్లు కూడా ఉన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ విక్రమ్ సింగ్, ఏఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్‌బీ సీఐ రాఘవేంద్ర, ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ, ఒంగోలు టౌన్ సీఐలు నాగరాజు, అజయ్ కుమార్, శ్రీనివాసులు, ఒంగోలు ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, ఆర్ఐలు సీతారామిరెడ్డి, రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


సైకిల్ ర్యాలీ చేస్తున్న సీఐఎస్ఎఫ్ జవాన్లు, కమాండెంట్లతో ఎస్పీ దామోదర్, పోలీస్ అధికారులు, సిబ్బంది

పార్కు అభివృద్ధి పనులు ప్రారంభం


పార్కులో వాకింగ్ ట్రాక్ పనులను ప్రారంభిస్తున్న కమిషనర్

ఒంగోలు సబర్బన్: నగరంలోని 37వ డివిజన్‌లో ఎన్‌టీఆర్ పార్క్‌లో వాకింగ్ ట్రాక్ పనులను శనివారం నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. పార్కుతో పాటు పలు అభివృద్ధి పనులను కూడా కమిషనర్ ప్రారంభించి మాట్లాడారు. రూ.27 లక్షలతో పనులు చేయనున్నట్లు చెప్పారు. అనంతరం 12, 13 డివిజన్లలో నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ సిబ్బంది, టౌన్ ప్లానింగ్, శానిటరీ సిబ్బందితో కలిసి కమిషనర్ పర్యటించారు. ఆయా డివిజన్లలో చేయాల్సిన పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. అధికారులు, సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. 37వ డివిజన్ కార్పొరేటర్ చెన్నుపాటి వేణుగోపాల్, 12, 13 డివిజన్ల కార్పొరేటర్లు, మున్సిపల్ ఇంజినీర్ చంద్రయ్య, డీఈ పద్మజ, ఏఈ రాజశేఖర్, 5వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, నాయకులు పాల్గొన్నారు.

శానిటేషన్‌పై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి


కొత్తపట్నంలో ఎస్‌డబ్ల్యూపీసీ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీకృష్ణ


మద్దిపాడులో పాల్గొన్న మండల స్పెషల్ ఆఫీసర్, డీఆర్‌డీఏ పీడీ నారాయణరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ వరప్రసాద్

సంతనూతలపాడు: ప్రతి గ్రామంలో శానిటేషన్‌పై కార్యదర్శులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సంతనూతలపాడు ఎంపీడీవో డి.సురేష్‌బాబు ఆదేశించారు. సంతనూతలపాడులోని ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంలో శనివారం రెండోరోజు చెత్త నుంచి సంపద తయారీపై చీమకుర్తి మండల స్థాయిలో కార్యదర్శులు, క్లాప్‌మిత్రలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం శానిటేషన్ విషయంలో సీరియస్‌గా ఉందన్నారు. కార్యదర్శులు వారి గ్రామాల పరిధిలో తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా గ్రామాల్లో తాగునీరు, శానిటేషన్, స్ట్రీట్ లైట్లపై నడుం బిగించాలని సూచించారు. తడి చెత్త నుంచి వచ్చే వర్మీ కంపోస్ట్ సంపద ద్వారా గ్రామ పంచాయతీల ఆదాయాలు పెంపొందించుకోవాలన్నారు. అందుకోసం ఈ శిక్షణను కార్యదర్శులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు. గుంటూరు కళా జాత బృందం ప్రతినిధి ఉమాశంకర్ ఆధ్వర్యంలో తడి చెత్త, పొడి చెత్త, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యం, స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర, తదితర అంశాలపై నిర్వహించిన కళాజాత ఆకట్టుకుంది. ఈ నెల 24వ తేదీ నాగులుప్పలపాడు మండలం, 25వ తేదీ మద్దిపాడు మండలం కార్యదర్శులు, క్లాప్ మిత్రలకు సంతనూతలపాడులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమానికి సంతనూతలపాడు ఈవోఆర్డీ ఎం.రమణమ్మ అధ్యక్షత వహించగా, రిసోర్స్ పర్సన్లుగా చీమకుర్తి ఈఓఆర్డీ అజితా, పల్లామల్లి పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు వ్యవహరించారు. సంతనూతలపాడు మేజర్ పంచాయతీ కార్యదర్శి ఎస్. ప్రతాప్ కుమార్ పర్యవేక్షించగా, చీమకుర్తి మండల కార్యదర్శులు, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.


సంతనూతలపాడులో మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్‌బాబు

వ్యర్థాల ద్వారా కంపోస్టు ఎరువులు తయారు చేయాలి...

కొత్తపట్నం: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకొచ్చి గ్రామ పంచాయతీల్లోని వ్యర్థాలను సేకరించి కేంద్రానికి తరలించి కంపోస్టు ఎరువులు తయారు చేయాలని కొత్తపట్నం ఎంపీడీవో పి.శ్రీకృష్ణ సూచించారు. మండలంలోని కె.పల్లెపాలెం పంచాయతీలో గల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో శనివారం రెండో రోజు స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీలలో ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. పలు అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ చక్రధర్, ఈవోపీఆర్డీ వేణు, కె.పల్లెపాలెం పంచాయతీ కార్యదర్శి సంపత్, మండలంలోని 15 పంచాయతీల కార్యదర్శులు, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలి...

మద్దిపాడు: గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్, డీఆర్‌డీఏ పీడీ టి.నారాయణరావు సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన శిక్షణ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల వారీగా త్వరలో తాను పర్యటిస్తానని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, హౌసింగ్ ఏఈలతో మాట్లాడి వారి పరిధిలో నిర్వహిస్తున్న కార్యక్రమాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ వరప్రసాద్, ఈఓపీఆర్డీ రఘుబాబు, ఏఈలు బాబు, రవి, విరించి, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

పోక్సో కేసులపై అవగాహన అవసరం

చీమకుర్తి: పోక్సో కేసులపై స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎస్.కోమలివల్లి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. శనివారం చీమకుర్తిలోని ప్రభుత్వ హైస్కూల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పోక్సో చట్టాలు, బాలికలకు రక్షణ కల్పించడం వంటి అంశాల గురించి వివరించారు. ఎక్సైజ్ సీఐ సుకన్య, ఎస్సై కృష్ణయ్య, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోమలివల్లి

బాలికలకు సమాజంపై అవగాహన అవసరం

నాగులుప్పలపాడు: సమాజంలో చోటుచేసుకునే మంచి, చెడులపై బాలికలకు కనీస అవగాహన అవసరమని ఒంగోలు ఏడీజే కోర్టు జడ్జి అమ్మన్నరాజు అన్నారు. బాలికల రక్షణ, జాగ్రత్తలు అనే అంశంపై శనివారం అమ్మనబ్రోలు బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జడ్జి అమ్మన్నరాజు మాట్లాడుతూ బాలికలు తమను తాము కాపాడుకునేలా ఆత్మస్థైర్యంతో పాటు చెడుపై తిరుగుబాటు స్వభావం కలిగి ఉండాలని సూచించారు. అనంతరం బాలికల హక్కులు, వారికి ప్రభుత్వం, చట్టపరంగా లభించే హక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్ బాబు, ఎస్సై శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయురాలు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి అమ్మన్నరాజు

మెరిట్ కం రోస్టర్ ప్రకారం పదోన్నతుల జాబితా తయారు చేయాలి

ఒంగోలు సిటీ: ఉపాధ్యాయుల పదోన్నతుల జాబితాలో తప్పులను సవరించి మెరిట్ కం రోస్టర్ పద్ధతి ప్రకారం తయారు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కె.ఎర్రయ్య, ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చల్లా శ్రీనివాసులు, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు నర్రా కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆ మేరకు శనివారం జిల్లా విద్యాశాఖాధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతులు కల్పించినప్పుడు మెరిట్ కం రోస్టర్ విధానం పాటించకుండా సెలక్షన్ ప్రకారం పదోన్నతులు కల్పించడం వల్ల పదోన్నతుల జాబితాలో తప్పులతడకలు ఉన్నాయన్నారు. ఇప్పుడైనా మెరిట్ కం రోస్టర్ ప్రకారం జాబితా తయారు చేయాలని కోరారు. అలాగే, 2023లో కోర్టు కారణంగా నిలిచిన పదోన్నతులను ముందుగా అమలు చేసిన తర్వాతే కొత్త పదోన్నతులు కల్పించాలని కోరారు. పదో తరగతి పరీక్షల మూల్యాంకనం నుంచి మినహాయింపు కోరిన వారికి మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.


ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

30 ఏళ్ల కలకు రూపం.. వర్గీకరణ

- ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో అధ్యక్షుడు బ్రహ్మయ్య మాదిగ

నాగులుప్పలపాడు: 30 ఏళ్ల పోరాట ఫలితమే ఎస్సీ కులాల వర్గీకరణ అని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ అన్నారు. ఎంఆర్‌పీఎస్ పురిటిగడ్డ అయిన నాగులుప్పలపాడు మండలంలోని ఈదుమూడి గ్రామంలో శనివారం నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో బ్రహ్మయ్య మాదిగ పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదం తెలపడంతో పార్టీలకు అతీతంగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. బాబా సాహెబ్ అంబేడ్కర్ అందించిన 15 శాతం రిజర్వేషన్ ఫలాలను ఇప్పటి వరకు ఎస్సీలలోని నాలుగైదు కులస్తులు మాత్రమే పొందుతున్నారని, ఇక నుంచి అందరికీ సమాన అవకాశాలు రావడం అనేది అంబేడ్కర్ ఆశయాలకు రూపమేనని అన్నారు. ఉద్యమం ఏర్పడక ముందు మాదిగ అంటే చెప్పుకోలేని స్థితి నుంచి నేడు గర్వంగా చెప్పుకోగలుగుతున్నామన్నారు. ఇదంతా కేవలం ఎంఆర్‌పీఎస్ పోరాటం ద్వారానే సాధ్యమైందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో ఎస్సీ వర్గీకరణ చట్టం చేసి మాదిగలకు, ఉప కులాలకు కల్పించిన రిజర్వేషన్ పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నామన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఆర్డినెన్స్ కాకుండా చట్టం చేయాలని కోరుతున్నామన్నారు. చట్టం చేయడం ద్వారా మాత్రమే మాదిగలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ ఉద్యమ ప్రస్థానంలో అమరులైన వారికి అమరుల స్థూపం వద్ద నివాళులర్పించారు.


సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మయ్య మాదిగ

కృష్ణమాదిగ తీరు బాధాకరం..

తల్లిపాలు తాగి రొమ్ము గుద్దిన చందంగా కృష్ణమాదిగ తీరు ఉందని బ్రహ్మయ్యమాదిగ ఆవేదన వ్యక్తం చేశారు. 30 ఏళ్ల కల సాకారమవుతున్న వేళ ఉద్యమం పుట్టిన ఊరు, అమరుల త్యాగాలను అవహేళన చేసే విధంగా కృష్ణమాదిగ మాట్లాడటం చాలా బాధగా ఉందన్నారు. ఇప్పటికైనా మనువాదుల భావజాలాల్లోంచి బయటకు వచ్చి వాస్తవాలను వక్రీకరించకుండా జాతికి నిజాలు చెప్పి క్షమాపణలు కోరాలని బ్రహ్మయ్య మాదిగ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పానుగంటి షాలేమ్ రాజు, ఏటుకూరి విజయ్ కుమార్, మానుకొండ శ్రీధర్, స్టాలిన్, గోపి, మహిళా నాయకులు సుభాషిణి, చంద్రలీల, బుజ్జమ్మ, సుమతి, రావినూతల కోటి, ఇంటూరి రోశయ్య, మల్లెల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపు చేయాలి

- సన్ హెల్పింగ్ పీపుల్ ఫౌండేషన్ సభ్యులు
- పలు ప్రాంతాల్లో అంతర్జాతీయ జల దినోత్సవం కార్యక్రమాలు

మద్దిపాడు: నీటిని పొదుపుగా వినియోగించాలని, భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రతి పౌరుడు పాటుపడాలని సన్ హెల్పింగ్ పీపుల్స్ ఫౌండేషన్ సభ్యులు కోరారు. అంతర్జాతీయ జల దినోత్సవం సందర్భంగా ఫౌండేషన్ ఫౌండర్ సీహెచ్ విజయకుమార్ ఆధ్వర్యంలో శనివారం మద్దిపాడు మండలంలోని వెల్లంపల్లి గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ నీటి వినియోగం, సంరక్షణ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో ఏర్పాటు చేస్తున్న ఫారం పాండ్‌ల వలన ఉపయోగాల గురించి వివరించారు. నీటిని పొదుపుగా వాడుకునే విధానం, నీటిని నిల్వ చేస్తూ భూగర్భ జలాలను పెంపొందించుకోవడం వంటి విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ మెంబర్ ప్రభావతి, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది కిషోర్‌కుమార్, సోమేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.


వెల్లంపల్లిలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సన్ హెల్పింగ్ పీపుల్ ఫౌండేషన్ సభ్యులు


పడమటినాయుడుపాలెంలో నీటికుంటకు భూమిపూజ చేస్తున్న ఎంపీడీఓ రాఘవేంద్ర

నీటికుంటల ద్వారా భూగర్భ జలాలు పెంచాలి...

చీమకుర్తి రూరల్: నీటికుంటల ద్వారా భూగర్భ జలాల స్థాయి పెంచాలని చీమకుర్తి ఎంపీడీఓ కె.రాఘవేంద్ర సూచించారు. శనివారం ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా మండలంలోని పడమటి నాయుడుపాలెంలో నీటికుంట నిర్మాణానికి భూమిపూజ చేశారు. మండలంలో 240 నీటికుంటలు తీయాలని, వర్షం నీరు వాటిలో చేరడం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కె.కరుణాకర్ రెడ్డి, ఏపీఓ రాఘవ శంకర్, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

డేటా అప్లోడింగ్‌ను పరిశీలించిన ఎంపీడీవో

సంతనూతలపాడు: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకంలో భాగంగా శనివారం సంతనూతలపాడు మండలంలోని మంగమూరు, తక్కెళ్లపాడు, ఎనికపాడు గ్రామాల్లో డేటా అప్లోడింగ్ కార్యక్రమాన్ని ఎంపీడీవో డి.సురేష్‌బాబు పరిశీలించారు. పనుల గుర్తింపు, తదితరాలను కూడా పరిశీలించగా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

సంతనూతలపాడు: గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సంతనూతలపాడులోని వడ్డెరపాలెంలో చోటుచేసుకుంది. స్థానికుడు తన్నీరు నాగరాజు (38) తన భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో పాటు తనకు తరచూ వస్తున్న కడుపునొప్పి తట్టుకోలేక ఈ నెల 20వ తేదీ వేకువజామున గడ్డి మందు తాగాడు. స్థానికులు ఒంగోలు జీజీహెచ్‌కి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. సంతనూతలపాడు పోలీసులు వారి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ ఉదయ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెలూన్ షాపులకు సబ్సిడీతో విద్యుత్ అందించండి

సంతనూతలపాడు: సెలూన్ షాపులకు సబ్సిడీతో విద్యుత్ సరఫరా చేయాలని నాయీ బ్రాహ్మణ సాధికారత కమిటీ కన్వీనర్ కరేటి నరసింహారావు శనివారం నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ డైరెక్టర్ నిడమానూరి రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. రూ.500కే విద్యుత్ మీటర్లు అందించాలని కోరారు. కార్యక్రమంలో మండల బార్బర్స్ యూనియన్ అధ్యక్షుడు గుంటూరు రమేష్, నాయకులు ఆదినారాయణ, రాఘవేంద్ర, అశోక్, ప్రసాదు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

విద్యార్థులు ఆత్మ రక్షణ అలవాటు చేసుకోవాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై అజయ్‌కుమార్

సంతనూతలపాడు: విద్యార్థులు ఆత్మ రక్షణ అలవాటు చేసుకోవాలని, మనో ధైర్యం కలిగి ఉండాలని ఎస్సై అజయ్‌బాబు సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సెల్ఫ్ డిఫెన్స్‌పై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. పలు సలహాలు, సూచనలు చేశారు. ఆపత్కర పరిస్థితులను ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలనే దానిపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

60 ఏళ్లు దాటిన ఎగ్జామినర్లకు మినహాయింపు ఇవ్వాలి


ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు

ఒంగోలు సిటీ: 60 సంవత్సరాలు దాటిన వారు ఎగ్జామినేషన్ పేపర్లు దిద్దేందుకు ఇష్టపడకపోతే వారికి మినహాయింపు ఇవ్వాలని ఏపీ వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మట్టిగుంట మహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పర్వతం రమణారెడ్డి కోరారు. శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి కిరణ్‌కుమార్ తరఫున అసిస్టెంట్ డైరెక్టర్ కె.ఉదయభాస్కర్ నిర్వహించిన జిల్లా కో ఆర్డినేషన్ సమావేశంలో వారు పాల్గొని వినతిపత్రం అందించారు. స్థానిక సర్వశిక్ష అభియాన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో పరీక్షల విభాగం ఏసీ, కార్యాలయ సిబ్బంది పాల్గొని చర్చించారు.

వెయిట్ లిఫ్టింగ్ విజేతకు పారితోషికం


మహేష్‌కు చెక్కు అందజేస్తున్న వీసీ మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబు

ఒంగోలు సిటీ: సీఎస్ పురంలోని బెల్లంకొండ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎస్.మహేష్ ఇటీవల పంజాబ్‌లో జరిగిన ఆలిండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో అఖిల భారత స్థాయిలో రెండో స్థానంలో నిలిచి వెండి పతకాన్ని కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్శిటీ తరఫున పోటీల్లో పాల్గొన్న మహేష్‌కు శనివారం ఆంధ్రకేసరి యూనివర్శిటీ వీసీ డి.వి.ఆర్.మూర్తి, రిజిస్ట్రార్ బి.హరిబాబు తదితరులు రూ.20 వేల పారితోషికం చెక్కు అందజేశారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దుల శ్రీనివాసరావు రూ.10 వేలు అందజేశారు. మహేష్‌ను పలువురు అభినందించారు.

నీటి సంరక్షణ కార్యక్రమాలకు చర్యలు


భూమి పూజ చేస్తున్న మంత్రి, కలెక్టర్

ఒంగోలు వన్‌టౌన్: నీటి సంరక్షణ కార్యక్రమాలు అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. జల దినోత్సవం సందర్భంగా ఒంగోలులోని జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయంలో జల శక్తి కేంద్రం ఏర్పాటుకు శనివారం కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి మంత్రి భూమి పూజ చేశారు. నీటి నమూనాలను పరిశీలించి మాట్లాడారు. భావితరాలకు నీటిని అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ పాల్గొన్నారు.